ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
బుధవారం 17 జనవరి 2024 | 5

జిల్లావ్యాప్తంగా ఘనంగా
సంక్రాంతి సంబరాలు - 8లో
బీచ్‌లో సందర్శకుల సందడి - 8లో
పౌరాణిక నాటకాలు ప్రారంభం

పందెం'కోట్లు'!

జిల్లాలో సంక్రాంతికి పండగకు కోడి కూత కోట్లు దాటింది. అడ్డూ అదుపు లేకుండా బరుల్లో కోళ్లు కత్తులు దూశాయి. అసలే ఎన్నికల ఏడాది కావడంతో అధికార వైసీపీ నేతలు స్వయంగా కోడిపందాలను ప్రోత్సహించారు. పందెం రాయుళ్లకు అసౌకర్యం కలగకుండా బరుల బాధ్యత తీసుకున్నారు. ఎక్కడా పోలీసులు వీటిపై కన్నెత్తి చూడకుండా ఒత్తిళ్లు తెచ్చి మరీ పందాలను ప్రోత్సహించారు. దీంతో జిల్లాలో తుని నుంచి తాళ్లరేవు వరకు హైవే వెంబడి ఎక్కడ చూసినా కోడిపందాలు పోటెత్తాయి. అడిగేవారు, అడ్డుకు నేవారు లేకపోవడంతో రేయిం బవళ్లు జాతరను తలపించాయి. గుండాట సైతం ఈ ఏడాది హద్దు లు దాటేసింది. వైసీపీ నేతల ప్రోత్సాహం, పోలీసు ల పరోక్ష సహకారంతో పండగ మూడురోజులు గుండాట నిర్వాహకులకు కోట్ల పంట పండింది.

- జిల్లాలో సంక్రాంతికి కోడిపందాలు, గుండాటల వ్యాపారం రూ.450కోట్లపైనే..
- తుని నుంచి తాళ్లరేవు వరకు హైవే వెంబడి పందాల జాతర
- గ్రామాల నుంచి పట్టణాలు, కాకినాడ వరకు అడ్డూఅదుపు లేకుండా గుండాట
- కాకినాడ రూరల్, జగ్గంపేట, సామర్లకోట, పెద్దాపురం, పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో రూ.150కోట్లకుపైగా జూదం
- ఎన్నికల ఏడాది కావడంతో ఓట్ల కోసం అడ్డగోలుగా వైసీపీ నేతల ప్రోత్సాహం
- అధికారపార్టీ నేతల ఒత్తిళ్లతో బరులవైపు కనీసం కన్నెత్తిచూడని పోలీసులు
- గ్రామాలవారీగా గుండాటలకు వేలంతో వైసీపీ నేతలకు లక్షల్లో కాసుల పంట



కాకినాడ రూరల్ మండలం సర్పవరంలో గుండాటలు



తుని మండలం వి.కొత్తూరు బరి వద్ద కోడిపందాలు నిర్వహిస్తున్న దృశ్యం



కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురంలో కోడి పందాలు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

జిల్లాలో భోగి, సంక్రాంతి, కనుమకు కోడిపందాలు, గుండాట వ్యాపారం ఏకంగా రూ.450కోట్లు దాటేసింది. ఇందులో ఒక్క గుండాటే రూ.250కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ఈ మొత్తం వ్యాపారంలో అధికార వైసీపీ నేతలకు గుండాటకు గ్రామాల్లో వేలంపాటల ద్వారా జేబులు నిండిపోయాయి. అటు సంక్రాంతికి కోడిపందాలకు అనుమతులు లేవని కలెక్టర్, ఎస్పీ చేసిన హెచ్చరికలు యథావిధిగా నవ్వులు పూయించాయి. అదే సమయంలో బరుల నుంచి స్టేషన్లకూ మామూళ్లు బాగానే మళ్లాయి.

ఎమ్మెల్యేల ఒత్తిళ్లతో నియోజకవర్గాల్లో ఎంచక్కా ఇవన్నీ మూడురోజులు జాతరను తలపించాయి. తమ పరిధిలో ఎక్కడెక్కడ కోడిపందాల బరులు, గుండాటలు ఉన్నాయో పోలీసులకు తెలిసినా అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో ఎక్కడా వాటివైపు కన్నెత్తి చూడలేదు. ఇదంతా ఒకెత్తయితే మండలాల్లో కోడి పందాల బరుల్లో ఒక్కోదాని నుంచి రూ.50వేలనుంచి రూ.లక్ష వరకు పలు స్టేషన్లకు మామూళ్లు వెళ్లాయి. వీటిని స్థానిక వైసీపీ నేతలే మధ్యవర్తులుగా పంపకాలు జరిపారు. దీంతో పోలీసులు చూసీచూడనట్లు పందాలు, గుండాటలను వదిలేశారు. ఎలాగూ అధికార పార్టీ నేతల ఒత్తిడి ఉండడంతో పందాలను అడ్డుకోకుండా నేతల ఖాతాల్లోకి తోసేశారు. కొన్నిచోట్ల తప్పనిసరి పరిస్థితుల్లో ఒకటీ రెండు కేసులు నమోదు చేసి మమ అనిపించేశారు. దీంతో జిల్లావ్యాప్తంగా ఆ చివర తుని నుంచి ఈ చివర తాళ్లరేవు వరకు మూడురోజులపాటు కోడిపందాలు పోటెత్తాయి. ప్రధానంగా ఎన్‌హెచ్-16, 216 జాతీయ రహదారి వెంబడి ఈ మూడు రోజులు ఎక్కడ చూసినా కోడిపందేలే కనిపించాయి. హైవేపై ప్రయాణించే వారికి స్పష్టంగా కనిపించేలా టెంట్లు, భారీ లైట్లు కనిపించాయి. ఇంత జరిగినా పోలీసులు మాత్రం పట్టనట్లు వ్యవహరించారు. కనుమ పండగ రోజు పందెంరాయుళ్ల మరీ రెచ్చిపోయారు. మెట్టతోపాటు కాకినాడ రూరల్, తాళ్లరేవు మండలాల్లో అర్ధరాత్రి వరకు పందాలు నిర్వహించారు. ఒకరకంగా చెప్పాలంటే భోగి, సంక్రాంతి, కనుమ ఈ మూడురోజుల్లో జిల్లావ్యాప్తంగా కోడిపందాలు రూ.150కోట్ల వరకు జరిగి ఉంటాయని అంచనా. గుండాట వ్యాపారం రూ.300కోట్ల వరకు ఉంటుందని అంచనా. మొత్తం సంక్రాంతి పండగకు జిల్లాలో కోడిపందాలు, గుండాట కలిపి రూ.450కోట్లకుపైగా వ్యాపారం జరిగింది. ఇందులో ఒక్క కనుమ రోజే జిల్లావ్యాప్తంగా రూ.210కోట్ల వరకు ఉంటుందని చెబుతున్నారు.



కొత్తపల్లి మండలం రమణక్కపేటలో కోడిపందాల బరి వద్ద బారులు తీరిన బైక్‌లు

'బరుల' బాధ్యతలు వారివే..

సంక్రాంతి పండగకు జిల్లాలో పందెంకోళ్ల ఢీకొట్టాయి. కోట్ల కట్టలతో కూతెట్టాయి. అడ్డూఅదుపు లేకుండా ఎక్కడికక్కడ మండల కేంద్రాలు, గ్రామాలు, పట్టణాల వరకు యథేచ్ఛగా మూడురోజులపాటు పందేలు, గుండాట జరిగిపోయాయి. ఒకపక్క ఈ సంక్రాంతికి జిల్లాలో కోడిపందాలకు అనుమతులు లేవని, పందాల నిర్వాహకులను ముందే బైండోవర్ చేయాలని, కోడికత్తులను స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్, ఎస్పీ పదేపదే హెచ్చరికలు జారీచేశారు. సమీక్షలపై సమీక్షలు చేసి పోలీసులను అప్రమత్తం చేశారు. తీరా అవన్నీ ఉత్తుత్తి హెచ్చరికలుగానే మిగిలిపోయాయి. ఎక్కడికక్కడ అధికార పార్టీ

పందాలకు తోడు మందు.. విందు..

జిల్లా కేంద్రాన్ని ఆనుకుని ఉన్న కాకినాడ రూరల్ మండలాన్ని పరిశీలిస్తే సర్పవరం, కొవ్వూరు, చీడిగ, గుడారిగుంట, గైగోలుపాడు, పండూరు, తిమ్మాపురం కలిపి మండలంలో ఏడుచోట్ల కోడిపందాల బరులు నిర్వహించారు. వీటిని ఆనుకుని యథేచ్ఛగా గుండాట వ్యాపారం జరిగింది. ఈ మండలంలో మూడురోజులు కలిపి దాదాపు రూ.12కోట్ల వరకు లావాదేవీలు జరిగాయి. సామర్లకోటలో మూడురోజుల పందేలు కలిపి రూ.15కోట్ల వరకు ఉంటుందని చెబుతున్నారు. మండలంలో ఎనిమిది చోట్ల బరులు నిర్వహించారు. ఎక్కడికక్కడే గుండాట కూడా ఏర్పాటు చేశారు. బరులు, గుండాట వద్దకు వచ్చిన వారికి నిర్వాహకులు మందు, విందు కూడా ఏర్పాటు చేశారు. ఏజెన్సీని ఆనుకుని ఉన్న రౌతులపూడి మండలంలో పందాలు, గుండాటకు అడ్డే లేకుండా పోయింది. సమీపంలోని అనకాపల్లి, విశాఖ జిల్లాలనుంచి కూడా పందెంరాయుళ్ల ఇక్కడకు పోటెత్తారు. ఈ మండలంలో మూడు రోజులు కలిపి రూ.6కోట్లవరకు వ్యాపారం జరిగింది. పెద్దాపురం మండలంలో ఏడు బరులు నిర్వహించారు. ఒక్కో బరి నుంచి సంబంధిత స్టేషన్‌కు రూ.50వేల వరకు మామూళ్లు వెళ్లాయి. హైవేను ఆనుకుని ఉన్న ప్రత్తిపాడు మండలంలో రూ.3కోట్ల వరకు పందాలు, గుండాట జరిగాయి. మంత్రి రాజా నియోజకవర్గం తునిలో కోడిపందాలు అడ్డు లేకుండా సాగాయి. హైవే వెంబడి, గ్రామాలు, తోటల్లో పందాలు, గుండాట నిరాటంకంగా జరిగిపోయాయి. నియోజకవర్గంలో మూడురోజులు పందాలు,గుండాట కలిపి రూ.45కోట్లకు పైగా ఉంటుందని అంచనా. గండేపల్లి, శంఖవరం, అన్నవరం రూరల్, జగ్గంపేట, ఏలేశ్వరం తదితర మండలాల్లో మూడు రోజుల్లో రూ.150కోట్లకుపైగా లావాదేవీలు జరిగాయి. వీటిలో ఒక్క జగ్గంపేటలోనే రూ.80కోట్లకుపైగా పందేలు, గుండాట వ్యాపారం జరిగింది. వాస్తవానికి ఎన్నికల ఏడాది కావడంతో సంక్రాంతి పండగను అడ్డంపెట్టుకుని అధికార వైసీపీ నేతలు జిల్లాలో రెచ్చిపోయారు. ఈసారి పందాలు, గుండాటను ప్రోత్సహించకపోతే గ్రామాల్లో ఓట్లు ఎక్కడ పడకుండా పోతాయోనన్న భయం వీరిని వెన్నాడింది. అసలే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉండడంతో పందాలకు ప్రోత్సాహం ద్వారా అయినా కొంతలో కొంత ఓట్లు తెచ్చుకోవచ్చనే ఆలోచనతో అనేకచోట్ల వైసీపీ ఎమ్మెల్యేలు బరుల నిర్వాహకులకు అండగా నిలబడ్డారు. అదే సమయంలో ఎమ్మెల్యేలు, వారి అనుచరులు పందెం నిర్వాహకులు, గుండాట నిర్వాహకులనుంచి వేలంపాట ద్వారా లక్షల్లో పిండేశారు. ఒక్కో గ్రామంలో వైసీపీ నేతల నుంచి అనుమతులు తీసుకున్నవారే గుండాట, కోడిపందాలు ఆడించడానికి ఒప్పందం కుదుర్చుకుని రూ.5లక్షల నుంచి రూ.15లక్షల వరకు వసూళ్లు చేశారు.



పిఠాపురం మండలం చిత్రాడలో జరుగుతున్న కోడిపందాలు

పందాలు చూసేందుకు వివిధ ప్రాంతాలనుంచి రాక..



కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురంలో కోడిపందాలను వీక్షిస్తున్న మహిళలు

సర్పవరం జంక్షన్, జనవరి 16: కాకినాడ రూరల్ మండలంలో కోళ్ల కత్తులు దూశాయి. సంక్రాంతి పండుగ మూడురోజులపాటు చీడిగ, తూరంగి, కొవ్వూరు, సర్పవరం, గైగోపాలుపాడు, తిమ్మాపురం, వలసపాకల, వాకలపూడి, సూర్యారావుపేట, నేమాం, పండూరు, కొత్తూరు గ్రామాల్లో నిర్వహించిన కోడి పందాల్లో కోట్లాది రూపాయలు చేతులు మారాయి. కనుమ పండుగ మంగళవారం సాయంత్రం 6 గంటల విద్యుత్తు లైట్ల కాంతుల్లో పందాలు జరిపారు. తిమ్మాపురం, సర్పవరం, వలసపాకల్లో నిర్వహించిన కోడి పందాలను వీక్షించేందుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతోపాటు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో కుటుంబసభ్యులతో సహా తరలివచ్చారు. మహిళలతోపాటు చిన్నా, పెద్దలు కూడా ఉన్నారు. పందాలవద్ద తిరునాళ్లను తలపించేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మందుబాబులకోసం మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. ఆహారాతులకు పలు రకాల పిండి వంటలు, పండ్లు, పలు రకాల నాన్ వెజిటేరియన్ కూరలతోపాటు బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేయడం విశేషం. తిమ్మాపురంలో జరిగిన కోడి పందాల్లో అధికంగా పందాలు నెగ్గిన వారికి లక్షలాది రూపాయలు నగదు రూపంలో బహుమతి ఇచ్చినట్లు జోరుగా ప్రచారం సాగింది.

జగ్గంపేటలో రూ.100కోట్ల పందాలు

జగ్గంపేట రూరల్, జనవరి 16: జగ్గంపేట కేంద్రంగా రూ.100కోట్ల మేర కోడిపందేలు జరిగినట్టు తెలుస్తోంది. ఈస్థాయిలో పందేలు జరగడం ఇదే మొదటిసారి. మెట్టప్రాంతానికి చెందిన ఓ వ్యాపారవేత్త కోటి రూపాయలు ఈ పందాలకు సమర్పించినట్టు సమాచారం. ఓ ప్రముఖుడు రూ.30లక్షలు పోగొట్టుకున్నట్టు తెలిసింది. ఇతర ప్రాంతాలనుంచి గుండాట, కోతాటకు ప్రత్యేక బ్యాచ్‌లు వచ్చాయి. గుండాట, కోతాటలను నిర్వహించే వారిలో సీనియర్లకు ఒక్కొక్కరికి రూ.10వేల వరకు నిర్వాహకులు వేతనాలు ఇచ్చారు. రాజపూడిలో పోలీసులు రాత్రి 8గంటలకు కాసేపు హల్‌చల్ చేసి వెళ్లిపోయారు.



జగ్గంపేట మండలం రాజపూడిలో కోడి పందాలు వేస్తున్న నిర్వాహకులు

'కోస'కు యమ డిమాండ్

- రెండు కిలోల కోస కోడి రూ.6వేలు

7లో



కోస మాంసాన్ని కోస్తున్న దృశ్యం

జగన్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలని..
వైఎస్ చిత్రపటానికి దుస్తులు

- పెద్దాపురంలో అంగన్‌వాడీల వినూత్న నిరసన

పెద్దాపురం, జనవరి 16: ముఖ్యమంత్రి జగన్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ దివంగత సీఎం, జగన్ తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి దుస్తులు పెట్టి పెద్దాపురంలో అంగన్‌వాడీలు తమ నిరసన తెలిపారు. అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్(సీఐటీయూ) ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారానికి 36వ రోజుకు చేరుకుంది. సమ్మెను ఉద్దేశించి యూనియన్ నాయకురాలు దాడి బేబీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తుంటే ప్రభుత్వానికి కనిపించడం లేదా అని విమర్శించారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దారపురెడ్డి క్రాంతికుమార్, సూరిబాబు, అమల, ఎస్తేరురాణీ, అంగన్‌వాడీ యూనియన్, సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పెద్దాపురంలో వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటం వద్ద దుస్తులు పెట్టిన అంగన్‌వాడీలు

సంక్రాంతి 'వేషాలు'



గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో సంక్రాంతి సందర్భంగా ఎడ్ల బండ్లపై దేవతామూర్తుల వేషధారణల ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంది. శ్రీకృష్ణుడు, లవకుశ, దుర్గాదేవి తదితర వేషధారణలతో ఎడ్ల బండ్లపై వెళ్తున్న కళాకారులు - 7లో

కనుమ పూజలు



ఏడాది పొడవునా రైతుకు వెన్నంటి ఉండే పశువులకు కనుమ పండుగ సందర్భంగా జిల్లాలో పాడి పెంప కందారులు ఇలా పూజలు నిర్వహించగా సామర్లకోటలో ఆవుకు పూజలు చేస్తున్న ఓ కుటుంబం - 8లో

కనులపండువగా..
ప్రభల తీర్థం - 7లో
- భక్తులతో కిక్కిరిసిన జగ్గన్నతోట

ఘనంగా సత్యదేవుడి
ప్రభల ఉత్సవం - 7లో

ద్వారపూడిలో ఘనంగా
మకరజ్యోతి దర్శనం - 7లో

భక్తజన జాతర



తరతరాల సంప్రదాయం తళుకులీనింది. కోనసీమలో ప్రభలు ఊరేగాయి. పద్దె పండగ కోనసీమకు కొత్త అందాలు అద్దింది. నేలతల్లి అభయహస్తాల్లాంటి కొబ్బరి చెట్లతో పోటీ పడుతూ రంగు రంగుల ప్రభలు ముందుకు సాగాయి. అన్నపూర్ణ పరిచిన మహావిస్తరిలాంటి వరి చేలలో వాటి పయనం కనువిందు చేసింది....డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మొసలపల్లిశివారు జగ్గన్నతోట ప్రభల తీర్థం మంగళవారం కన్నుల పండువగా జరిగింది. జగ్గన్నతోట 7 ఎకరాల భూమి భక్తులతో కిక్కిరిసింది.



ఎడ్లబండిపై తీర్థం చూడదానికి..



కొలువుదీరిన ప్రభలు

జన సందోహం | జగ్గన్నతోట ప్రభల తీర్థం

- తీర్థంలో కొలువుదీరిన ఏకాదశ రుద్రుల ప్రభలు
- ప్రభలు అప్పర్‌కౌశిక దాటే సమయంలో
- వీక్షించేందుకు పోటెత్తిన భక్తులు
- తీర్థంలో భారీ బందోబస్తు
- వివిధ రాష్ట్రాలు,
- విదేశాల నుంచి కూడా వచ్చిన జనం
- కిక్కిరిసిన రహదారులు

అంబాజీపేట, జనవరి 16:తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలకు నిలువుటద్దంలా నిలిచే ఈ తీర్థానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఇరుసుమండ, కె.పెదపూడి, మొసలపల్లి నుంచి జగ్గన్నతోటకు వెళ్లే రోడ్లన్నీ కిటకిటలాడాయి. 450 ఏళ్ల నుంచి ఏకాదశ రుద్రులు కొలువుగా ప్రసిద్ధిగాంచిన జగ్గన్నతోటకు వివిధ గ్రామాల నుంచి 11 ప్రభలు తరలిరావడం సంప్రదాయం. తీర్థానికి వచ్చే ఇతర గ్రామాల ప్రభలకు స్వాగతం పలికే మొసలపల్లి మధుమానంత భోగేశ్వరస్వామి ప్రభల ఉదయం తొమ్మిది గంటలకే తీర్థంలో కొలువుతీరి స్వాగతం పలికింది. కౌశిక అవతలవైపు ఉన్న గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి ప్రభ, గంగలకుర్రు చెన్నమల్లేశ్వరస్వామి ప్రభలు కౌశిక దాటి తీర్థంలో ప్రవేశించే ఘట్టం చూపరులను గగుర్పాటుకు గురిచేసింది. శరభ... శరభ.. అశ్శరభ శరభ అంటూ బరువైన ప్రభలను యువకులు అవలీలగా భుజానకెత్తుకొని భక్తిభావంతో ముందుకు సాగారు. ఉదయం ఎనిమిది గంటలకే ఆయా గ్రామాల్లోని ప్రభలకు ప్రత్యేక పూజలను నిర్వహించి ఉత్సవ విగ్రహాలను ప్రభలపై కొలువుతీర్చి మేళతాళాలతో తీర్థానికి తీసుకువచ్చారు. చిరతపూడి చిట్టిచెరువు గట్టు, నరేంద్రపురం, అవిడి, రాకూర్తివారిపాలెం ప్రభలు చిరతపూడిలో కొలువుతీరాయి. వాకలగరవు, తొండవరం ప్రభలు తొండవరంలో కొలువుదీరాయి. తొండవరం, వాకలగరువు ప్రభలు ఒకదానికొకటి పోటీపడి చూపరులను కనువిందు చేశాయి.





కొలువుదీరిన ప్రభలు

ట్రాఫిక్ కష్టాలు

ఇరుసుమండ, పుల్లేటికుర్రు, గంగలకుర్రు, మొసలపల్లి, కె.పెదపూడి రహదారులు వాహనాలతో నిండిపోవడంతో ప్రయాణికులు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు.

భారీ బందోబస్తు

మొసల్లపల్లి శివారు జగ్గన్నతోటతో పాటు వాకలగరువు, చిరతపూడి ప్రభల ఉత్సవాలకు జిల్లా ఎస్పీ శ్రీధర్ ఆదేశాల మేరకు కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ పర్యవేక్షణలో సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ ఏ.చైతన్యకుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. తీర్థంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏఎస్ఎస్ పార్టీ బలగాలను మోహరించారు.



ఆకర్షణీయంగా ఉన్న ప్రభలు

కొలువుదీరిన ప్రభలు

వ్యాఘ్రేశ్వరం వ్యాఘ్రేశ్వర స్వామి (విశ్వేశ్వరరుద్రుడు), గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి (సర్వేశ్వరరుద్రుడు), నేదునూరు చెన్నమల్లేశ్వరస్వామి (తికాగ్ని కాలరుద్రుడు), కె.పెదపూడి మేనకేశ్వరుడు (మహాదేవ రుద్రుడు), పుల్లేటికుర్రు అభినవ వ్యాఘ్రేశ్వరస్వామి (శ్రీమన్మహాదేవరుద్రుడు), ముక్కామల రాఘవేశ్వరస్వామి(కాలాగ్ని రుద్రుడు) , వక్కలంక విశ్వేరస్వామి (త్రిపురాంతక రుద్రుడు), మొసలపల్లి మధుమానాంత భోగేశ్వర స్వామి (నీలకంఠ రుద్రుడు), పాలగుమ్మి చెన్నమల్లేశ్వరుడు (మృత్యుంజయ రుద్రుడు), గంగలకుర్రు చెన్నమల్లేశ్వరస్వామి (సదాశివరుద్రుడు), ఇరుసుమండ ఆనందరామేశ్వరస్వామి (త్ర్యంబకేశ్వర రుద్రుడు) జగ్గన్న తోట ప్రభల తీర్థంలో కొలువుదీరారు.

సంబరాన్ని వీక్షించేందుకు వచ్చిన జనం



అంబరాన్నంటిన సంబరం

కొత్తపేట, జనవరి 16: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటలో సంక్రాంతి ప్రభల ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా విదేశాల్లో స్థిరపడిన ఇక్కడి కుటుంబాల వారు సైతం పండుగకు విచ్చేసి సందడి చేశారు. సాంస్కృతిక ప్రదర్శనల నడుమ వచ్చిన ప్రభలను ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కొలువుదీర్చారు. నాదస్వర మేళాలు, డప్పు వాయిద్యాలు, విచిత్ర వేషధారణలు, డీజే పాటలు ఎంతగానో అలరించాయి. బోడిపాలెం, కొత్త, పాత రామాలయ వీధుల ఉత్సవదారుల ఆధ్వర్యంలో పోటాపోటీగా జరిగిన బాణసంచా కాల్పులు చూపరులను కట్టిపడేశాయి. ప్రభలను ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. లక్షలాదిగా తరలివచ్చిన వారితో కొత్తపేటలోని ముఖ్య కూడళ్లన్నీ జనసంద్రంగా మారాయి. ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎస్పీ శ్రీధర్ ఆదేశాల మేరకు డీఎస్పీ కేవీ రమణ ఆధ్వర్యంలో సుమారు 500 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బాణసంచా కాల్పులు



ఆకట్టుకున్న స్వర్ణప్రభ



కొత్తపేట, జనవరి 16: కొత్తపేట శ్రీవిద్య జ్యువెలర్స్ మణి అనే స్వర్ణకారుడితో మూడు గ్రాముల బంగారంతో తయారు చేయించిన లక్ష్మీగణపతి ప్రభ అందరినీ ఆకట్టుకుంది. సంక్రాంతి ఉత్సవానికి వచ్చిన వారు దీనిని చూసేందుకు ఎగబడ్డారు.

మకరజ్యోతి దర్శనం



ఆభరణాలను తీసుకువస్తున్న దృశ్యం

మండపేట, జనవరి 16: ఆంధ్రా శబరిమలైగా పిలిచే బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడి అయ్యప్ప స్వామి ఆలయంలో మకర జ్యోతి దర్శన ఉత్సవం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపకుడు ఎస్.ఎ.ఎల్ కనకరాజు సారథ్యంలో సోమవారం గురుస్వామి స్వగృహం నుంచి స్వామివారి ఆభరణాలను రాయవరం మండలం సోమేశ్వరానికి చెందిన కర్రి ఆదినారాయణరెడ్డి శిరస్సున ధరించి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు, ఇరుముడుల సమర్పణ జరిగింది. సాయంత్రం బాణసంచా కాల్పులు, మేళతాళాల నడుమ మకరజ్యోతి దర్శనం జరిగింది. ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు స్వాములకు ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



రత్నగిరిపై ప్రభల ఉత్సవం

అన్నవరం, జనవరి 16: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో కనుమ పండుగ సందర్భంగా మంగళవారం ప్రభల ఉత్సవం ఘనంగా జరిగింది. సాయంత్రం 7గంటలకు స్వామి, అమ్మవార్లను కొండపై నుంచి పల్లకిలో బాజాభజంత్రీలు, మంగళవాయిద్యాల నడుమ కొండదిగువ చినరావిచెట్టు పుర గిరి క్షత్రియుల రామాలయం వద్దకు తీసుకునివచ్చారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ప్రభపై స్వామి,అమ్మవార్లను ఆశీనులు గావించి అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏఈవోలు కృష్ణారావు, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు. సత్యదేవుడి గోశాలలో మంగళవారం సాయంత్రం గోపూజోత్సవం నిర్వహించారు. ఈవో రామచంద్రమోహన్ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. కనుమ పండుగ రోజున గోపూజ నిర్వహించడం ద్వారా పాడిపంటలు సమృద్ధిగా పండుతాయని పండితులు పేర్కొన్నారు.





ఎడ్లబండ్ల వేషాలు

- చేబ్రోలులో దేవతామూర్తుల
- వేషధారణల ప్రదర్శన
- ఆకట్టుకున్న కళాకారులు

గొల్లప్రోలు రూరల్, జనవరి 16: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలంలోని చేబ్రోలు గ్రామంలో సంక్రాంతి సందర్భంగా ఎడ్లబండ్లపై వేషధారణలతో గ్రామమంతా ప్రదర్శన నిర్వహించారు. శ్రీకృష్ణ వేషధారణలు, వివిధ దేవ తాలంకారాలతో జరిపిన ప్రదర్శన ఆకట్టుకొంది. నరకాసుర సంహారం తదితర అంశాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ప్రతీ ఏటా సంక్రాంతి సందర్భంగా ఇక్కడ బండ్ల వేషాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కళాకారులు వేషాలు వేయడంతో తిలకించేందుకు వీధుల్లోకి భారీగా తరలివచ్చారు. రాత్రంతా బండ్ల వేషాలు కొనసాగాయి. వీటిని తిలకించేందుకు ఇతర గ్రామాల నుంచి ప్రజలు తరలిరావడం విశేషం. బండ్ల వేషాలతో గ్రామమంతా సందడి నెలకొంది.

తదుపరి సినిమా ప్రభాస్‌తో..డైరెక్టర్ సందీప్‌రెడ్డి వంగా



అంతర్వేది, జనవరి 16: స్టార్ డైరెక్టర్ సందీప్‌రెడ్డి వంగా మంగళవారం బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది విచ్చేశారు. ముందుగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామిని స్నేహితులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నాచెల్లెల గట్టు, బీచ్, లైట్‌హౌస్ పరిసర ప్రాంతాలను సందర్శించారు. బీచ్ వద్ద ఆయన్ను తదుపరి సినిమా ఎవరితో అని అడగ్గా ప్రభాస్‌తో భారీ ప్రాజెక్టు చేయనున్నట్టు చెప్పారు. త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తానన్నారు. ఇటీవల యానిమల్ సినిమా సూపర్ హిట్ అయిందని, దీంతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. విభిన్నమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తూ ఖాళీ సమయంలో ఇలా పుణ్య క్షేత్రాలు దర్శనం, విహార యాత్రలు చేస్తుంటానన్నారు. కోనసీమలో జరుగుతున్న సంక్రాంతి ఉత్సవాల్లో పాల్గొన్నానని, ఇంతటి చక్కటి అందమైన వాతావరణం మనసుకు ఎంతో ఆహ్లాదాన్నిచ్చిందని సందీప్‌రెడ్డి వంగా చెప్పారు.

ముగిసిన బాస్కెట్‌బాల్ పోటీలు

- పురుషుల విభాగంలో హైదరాబాద్,
- మహిళల విభాగంలో ఛత్తీస్‌గఢ్ జట్లు విజేతలు



విజేతలతో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు

రామచంద్రపురం, జనవరి 16: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు జాతీయ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఈనెల 12 నుంచి 15 వరకు జరిగిన 13వ ఆలిండియా, 19వ ఆంధ్రప్రదేశ్ ఓపెన్ బాస్కెట్‌బాల్ పోటీల్లో పురుషుల విభాగంలో సెయింట్ ఆర్టిలేరి (హైదరాబాద్), మహిళల విభాగంలో బిలాయ్ స్టీల్స్ (ఛత్తీస్‌గడ్) జట్లు విజేతలుగా నిలిచాయి. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి, రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సి.స్టాలిన్ మంగళవారం వివరాలు వెల్లడించారు. సోమవారం అర్ధరాత్రి వరకు జరిగిన ఫైనల్ పోటీల్లో విజేతగా పురుషుల విభాగంలో ప్రథమ స్థానం హైదరాబాద్‌కు చెందిన సెయింట్ ఆర్టిలేరి, ద్వితీయ స్థానం కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ (హైదరాబాద్), తృతీయ స్థానం రామచంద్రపురం జట్టు, నాలుగో స్థానం హైదరాబాద్ డీటీపీ జట్టు కైవసం చేసుకున్నాయి. మహిళల విభాగంలో మొదటి స్థానం ఛత్తీస్‌గడ్‌కు చెందిన బిలాయ్ స్టీల్స్ జట్టు, ద్వితీయ స్థానం రామచంద్రపురం మహిళా జట్టు, మూడో స్థానం హైదరాబాద్‌కు చెందిన డిఫెన్స్ జట్టు, నాలుగో స్థానం ఏలూరు జట్లు నిలిచాయి. కాకినాడ సత్య స్కాన్ సెంటర్ అధినేత కాదా వెంకటరమణ, డాక్టర్ సి.స్టాలిన్, గన్నమని చక్రవర్తి, ఆర్టోస్ ఎండీ అడ్డూరి సంతోష్ వర్మ, డాక్టర్లు సి. రామారావు, సి.కవిత, డాక్టర్ కె.వి.ఎస్‌సతీష్, అసోసియేషన్ సభ్యులు విజేత జట్లకు బహుమతులు అందించారు.

కోస మాంసం డిమాండే వేరు

కోడి ధర రూ.6 వేలు వరకు పలుకుతున్న వైనం

సామర్లకోట, జనవరి 16: కోడి పందాలలో ఓడిన కోడి మాంసాన్ని కోస మాంసం అంటారు. ఈ మాంసానికి ఆయా కోడి పందాల బరుల వద్ద ఎంతగానో డిమాండ్ ఉంటుంది. ఆయా కోడి పందాల వద్దే పందాలలో ఓడిన కోడిని వెంట్రుకలు కాల్చి, ముక్కలుగా కొట్టి కోసమాంసంగా తయారుచేసే పనివారు సైతం అందుబాటులోనే ఉంటారు. పందాలలో ఓడిన కోస కోడిపుంజు రెండు కిలోల బరువు వుంటే దాని ధర రూ. 6 వేలు ఉంటుంది. ఇక మాంసం కొట్టేందుకు ఒక్కొక్కదానికి రూ. 200 వసూలు చేస్తున్నారు. పందాలు మండలంలోని మూడు ప్రధాన గ్రామాలలో భారీ పందాలు, అయిదు చిన్న గ్రామాలలో చిన్న మాదిరి పందాలలో సుమారు 400 కోసలు సేకరించి బహుమతులుగా పంపారు. మండలంలోని ఒక ప్రధాన గ్రామంలో సుమారు 140 కోసల మాంసాలను రాజకీయ నాయకులకు, అధికారులకు, పోలీసులకు నజ రానాలుగా పంపినట్లు సమాచారం. పందాలలో పాల్గొనే కోడిపుంజులను పండుగ రోజులకు సుమారు మూడు నెలల ముందునుంచీ బాదంపప్పు, పిస్తాపప్పు, గుడ్లు, జీడిపప్పు, బలవర్ధక మాత్రలు తదితర అధిక పోషక విలువలు ఉండే ఆహారాన్ని పెడతారనే ప్రచారం ఉండడంతో పండుగ రోజులలో కోసమాంసం రుచులను ఆస్వాదించేందుకు ప్రతీఒక్కరూ ఆసక్తి కనబరుస్తారు.

మంత్రి రాజా, ఎమ్మెల్సీ కుడుపూడి వేధిస్తున్నారు

- న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యం
- బాధితురాలు రాజులపూడి ఆరుద్ర

సర్పవరం జంక్షన్, జనవరి 16: అనారోగ్యంతో బాధపడుతున్న దివ్యాంగురాలైన కుమార్తెకు వైద్యం చేయించేందుకు సొంత స్థలం విక్రయంలో మంత్రి దాడిశెట్టి రాజా గన్‌మెన్ అడ్డుతగులుతున్నాడు. న్యాయం కోసం సీఎంవోకు వెళ్లినా న్యాయం జరగలేదు. ఏపీలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది. దివ్యాంగురాలికి రక్షణ, న్యాయం కల్పించలేని ప్రభుత్వం న్యాయం కోసం వెళితే పిచ్చాసుపత్రిలో చేర్పించారు. మంత్రి రాజా, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ వేధింపులకు పాల్పడుతున్నారు. పోలీసు అధికారులు రాత్రి సమయాల్లో వచ్చి స్టేట్‌మెంట్లు అంటూ వేధిస్తున్నారు. గత్యంతరం లేక కాశీకి వచ్చి తలదాచుకుంటున్నాను' అంటూ కాకినాడ రూరల్ రమణయ్యపేట శివారు రాయుడుపాలెంకు చెందిన బాధితురాలు రాజులపూడి ఆరుద్ర మంగళవారం సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వీడియో వైరల్‌గా మారింది. దివ్యాంగురాలైన తన కుమార్తె సాయిలక్ష్మీచంద్ర వెన్నుముక సమస్యతో బాధపడుతోందని ఇల్లు అమ్మి వైద్యం చేయించాలని చూస్తే మంత్రి దాడిశెట్టి రాజా గన్‌మెన్ అడుగడుగునా అడ్డుతగిలి ఇబ్బందులు సృష్టిస్తున్నాడని వాపోయారు. నవంబరు 2023లో సీఎంని కలిసేందుకు ప్రయత్నించినా కుదరకపోవడంతో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించానని చెప్పారు. న్యాయం కోసం పోరాడితే పోలీసులతో అధి కారులు బలవంతంగా పిచ్చాసుపత్రిలో చేర్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం కోసం చంద్రబాబు, పవన్ డీజీపీకి లేఖ రాశానని చెప్పారు. అయినా న్యాయం జరగలేదన్నారు. న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యమని చెప్పారు.

హైకోర్టు న్యాయమూర్తి పూజలు



స్వామివారిని దర్శించుకున్న చక్రవర్తి కుటుంబం

అన్నవరం, జనవరి 16: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.వి.ఎల్.ఎన్ చక్రవర్తి కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందజేశారు.

బీచ్‌లో సందర్శకుల సందడి

సర్పవరం జంక్షన్, జనవరి 16: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ఆది,సోమ,మంగళవారం సూర్యారావుపేట సాగర తీరం సందర్శకులతో కిటకిటలాడింది. సంక్రాంతికి సొంత గ్రామాలకు వచ్చిన గ్రామస్థులు, బంధువులు, కుటుంబ సభ్యులతో కలసి ఎన్టీఆర్ బీచ్‌కు వేలాది సంఖ్యలో తరలివచ్చారు. పెద్దలు, యువతీ, యువకులు సముద్ర స్నానాలాచరించారు. సముద్రంలో ఈతకొట్టేందుకు లోతుకు వెళ్లకుండా కాకినాడ మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో హెచ్చరికలు చేస్తూ పర్యాటకులను అప్రమత్తం చేశారు.

ధర్మవరంలో పౌరాణిక నాటకాలు ప్రారంభం

ప్రత్తిపాడు, జనవరి 16: మండలంలోని ధర్మవరంలో గౌరీశంకర్ల 87వ వార్షికోత్సవ మహోత్సవాల్లో భాగంగా పౌరాణిక నాటకోత్సవాలను గ్రామ సర్పంచ్ బెంతుర్తి సుశీల అబ్బాయి, జడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, ఎంపీటీసీ జువ్వల సుజాత ప్రారంభించారు. నాటకోత్సవాల్లో భాగంగా రాష్ట్ర కళాకారులతో గయోపాఖ్యానం నిర్వహించారు. శ్రీకృష్ణుడుగా కిలారి లక్ష్మి, అర్జునుడుగా బిక్కవోలు రాంబాబు, పీవీ.కృష్ణ చైతన్య గౌడ్‌గా డీఎస్పీరావు నటించారు. అలాగే శ్రీ సీతారత్న లలిత కళానృత్యనికేతన్ నాటాచార్యులు కోట దివాకర్, ముళ్ళపూడి విజయలక్ష్మి ఆధ్వర్యంలో 35 మంది చిన్నారులు, కళాకారులు మహాభారతంలోని శ్రీకృష్ణుని బాల్యం నుంచి ద్రౌపతి వస్త్రాభరణం, అర్జునుడికి కృష్ణుడు గీతాపదేశం తదితర సన్నివేశాలలతో కూడిన కళా ప్రదర్శన నిర్వహించారు. పౌరాణిక నాటక ప్రదర్శనకు తోడ్పాటునందించిన దాతలు, ప్రజాప్రతినిధులకు నిర్వాహక కమిటీ సభ్యులు కిలారి బాబ్జీ,గొర్ల మాణిక్యం, కోనేటి రాజబాబు, గొనగాల రామకృష్ణ, బర్ల వీర సాంబమూర్తి, దాడి శ్రీను జ్ఞాపికలు అందజేశారు.

కన్నుల పండువగా మకరజ్యోతి దర్శనం

పిఠాపురం, జనవరి 16: పట్టణంలోని కుమారస్వామి దేవస్థానంలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం రాత్రి మకరజ్యోతి (మకర విళక్కు) దర్శనం కన్నుల పండువగా జరిగింది. అయ్యప్పస్వామికి అభిషేకాలు, నూతన వస్త్ర అలంకరణ, పుష్పార్చన, పడిపూజ, హరిహరాసనం నిర్వహించారు. మకర జ్యోతిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. అంతకుముందు పాదగయ క్షేత్రంలో స్వామి దివ్యాభరణాలకు పూజాధికాలు నిర్వహించి మేళతాళాలతో అయ్యప్పస్వామి ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. వాటిని ఆలయ అర్చకులకు అందజేశారు. అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, పలువురు ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీల ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన ధనుర్మాసోత్సవాలు

పిఠాపురం, జనవరి 16: పట్టణంలో రుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో నెలరోజులుగా జరుగుతున్న ధనుర్మాసోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. కనుమరోజున స్వామి,అమ్మవార్లకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన కుంకుమపూజలు జరిగాయి. వేదపండితుల మంత్రోశ్చారణల మధ్య వైఖానస ఆగమం ప్రకారం అభిషేకం జరిపించారు. అనంతరం గరుడ వాహనంలో స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. పురవీధుల్లో గరుడ వాహనంపై తిరుగాడిన స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు పి.విజయజనార్ధనాచార్యులు జరిపించగా, ఆలయ ఈవో సున్న శ్రీరాములు ఉన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు

తొండంగి, జనవరి 16: తొండంగి మండలం గొల్ల ముసలయ్యపేట శివారు వాడ ముసలయ్యపేట గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు మోసా సూరిబాబు, జగన్నాధం, మెరికల శ్రీను, చోడిపల్లి నూకరాజు, మోసా సూరిబాబు తదితరులు మంగళవారం ఒంటిమామిడిలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి యనమల కృష్ణుడు సమక్షంలో టీడీపీలో చేరారు. వారందరికీ కృష్ణుడు పార్టీ కండవాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నారన్నారు. కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేసి మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి పేకేటి హరికృష్ణ, గొల్ల ముసలయ్యపేట సర్పంచ్ తాటిపర్తి శ్రీను, చొక్కా కాశీశ్వర్రావు తదితరులు ఉన్నారు.

జగ్గంపేట రూరల్: మండలంలోని రామవరం గ్రామానికి చెందిన వైసీపీ యువనేత, రామవరం గ్రామవార్డు సభ్యుడు కాపవరపు గంగాధర్ టీడీపీలో చేరనున్నారు. రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు అడబాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జ్యోతుల నెహ్రూను కలిసి పార్టీలో చేరనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ టీడీపీలో అందరికీ సముచిత స్థానం ఉంటుందని, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అందరూ కలిసి టీడీపీ పార్టీని గెలిపించుకునేందుకు కృషి చేయాలని వారికి సూచించారు.

ఘనంగా సత్తెమ్మతల్లి జాతర

పెద్దాపురం, జనవరి 16: పెద్దాపురం నుంచి జగ్గంపేట వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న సత్తెమ్మవారి జాతర మహోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. జాతరలో గరగల నృత్యాలు, పెద్దపులి ఆటలు, కళ్లు మిరుమిట్లు గొలిపే బాణసంచా, రంగురంగుల విద్యుత్ దీపాలంకరణతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని తీర్ధ ప్రసాదాలను స్వీకరించారు.

మద్యం స్వాధీనం

కాకినాడ క్రైం, జనవరి 16: సెబ్ అధికారుల దాడుల్లో మద్యం అక్రమ నిల్వలు బయటపడ్డాయి. సెబ్ సీఐ బి.వెంకటేశ్వర్రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ టూటౌన్ పరిధిలోని కొత్తపేట మార్కెట్ ప్రాంతానికి చెందిన గంగుమళ్ల జయరాం మద్యం బాటిళ్లు తన ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచి పలు ప్రాంతాల్లో కోడి పందాలు నిర్వహించే ప్రాంతాల్లోని బరుల్లో అధిక ధరలకు విక్రయించేందుకు సిద్ధం చేశాడు. సెబ్ అధికారులకు వచ్చిన సమాచారంతో మంగళవారం సెబ్ సిబ్బంది జయరాం ఇంటిపై దాడి చేసి 50 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నేమాం గ్రామంలో వాసంశెట్టి దుర్గాప్రసాద్ అనే వ్యక్తి నుంచి 19 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కాకినాడ నార్త్ సెబ్ స్టేషన్ పరిధిలో అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

యనమదలకు ప్రతిభా పురస్కారం


పురస్కారం అందుకుంటున్న యనమదల

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 16: మధునాపంతుల సూరయ్య శాస్త్రి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రముఖ హెచ్ఐవీ నిపుణులు డాక్టర్ యనమదల మురళీకృష్ణకు ప్రతిభా పురస్కారం ప్రదానం చేశారు. కాజులూరు మండలం పల్లిపాలెంలో జరిగిన ఈ కార్యక్రమానికి మధునాపంతుల సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు. యనమదల మాట్లాడుతూ సాహిత్యంలో రెండు పాయల్లో ఒక్కటైన భావుక, కాల్పనిక సాహిత్యంలో వచ్చినంత ఎక్కువగా, వైజ్ఞానిక వాస్తవిక సాహిత్యంలో రచనలు రాకపోవడం పెద్దలోటన్నారు. చరిత్ర, సైన్స్, టెక్నాలజీ, మెడికల్ రంగాల్లో రచనలు ప్రజల జీవితాలను గుణాత్మకంగా మారుస్తాయన్నారు. అనంతరం ఆయన కు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. కార్యక్రమంలో వెంకట చలపతి, మధునామూర్తి ఇతర కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

గౌరీనాయుడికి మహాసంక్రాంతి పురస్కారం

పిఠాపురం, జనవరి 16: పట్టణానికి చెందిన యువ సాహితీవేత్త డాక్టర్ కిలారీ గౌరీనాయుడికి మహాసంక్రాంతి సాహితి పురస్కారం లభించింది. ఆంధ్ర యూనివర్సిటీ కళాశాల మైదానంలో సంక్రాంతి సంబరాల్లో పురస్కారాన్ని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహరావు అందజేశారు. సాహిత్య, సంగీత, సాంస్కృతిక కళారంగాల్లో గౌరీనాయుడు చేస్తున్న కృషికి ఈ గుర్తింపు రావడంతో పలువురు అభినందించారు.

కత్తితో దాడిలో వ్యక్తికి తీవ్రగాయాలు

జీజీహెచ్ (కాకినాడ), జనవరి 16: కత్తితో దాడిలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ రూరల్ మండలం కొవ్వాడ గ్రామానికి చెందిన 25ఏళ్ల వెనిగెంటి వెంకటేష్ మంగళవారం పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా మార్గం మధ్యలో ఓ వ్యక్తి వెనుక నుంచి కత్తితో పొడిచి పరారయ్యాడు. అది గమనించిన స్థానికులు బాధితుడిని జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఇంద్రపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

వీరవరంలో క్రికెట్ పోటీలు

కిర్లంపూడి, జనవరి 16: వీరవరం గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో కొండపల్లి శివ, రాజు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. మంగళవారం వీరుకోహ్లి టీం రూ.8వేలు ప్రథమ బహుమతి అందుకున్నారు. 2వ బహుమతిగా అంబేడ్కర్ టీం రూ.4వేలు, బహుమతి అందుకున్నారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్ర్కీన్స్: నా సామిరంగ, సైంధవ్, గుంటూరు కారం, హనుమాన్

దేవీ మల్టీప్లెక్స్ 4 స్ర్కీన్స్: నా సామిరంగ, సైంధవ్, గుంటూరు కారం, హనుమాన్

తిరుమల	:	సైంధవ్
లక్ష్మి	:	గుంటూరు కారం
సీ అండ్‌సీ1	:	గుంటూరు కారం
సీ అండ్‌సీ2	:	హనుమాన్
శ్రీప్రియ	:	నా సామిరంగ
పద్మప్రియ	:	గుంటూరు కారం
సత్యగౌరి	:	నా సామిరంగ
సూర్య 1	:	గుంటూరు కారం
సూర్య 2	:	హనుమాన్

రావులమ్మను దర్శించుకున్న జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట రూరల్, జనవరి 16: జగ్గంపేట గ్రామదేవత రావులమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ అమ్మవారిని దర్శించుకున్నారు. జగ్గంపేట ప్రజల కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా రావులమ్మతల్లి నిలిచిందన్నారు. ఎస్వీ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, తుల రాము, పంద్రంగి రాంబాబు, తాతాజీ ఉన్నారు.

సంక్రాంతి సంబరాలు

» సంతోషంగా గడిపిన ప్రజలు
» పలుచోట్ల ముగ్గుల పోటీలు
» ఆలయాల్లో ప్రత్యేక పూజలు
» పేదలకు దుస్తులు, మిఠాయిల పంపిణీ
» హరిదాసులకు సత్కారం


రౌతులపూడి మండలం ఎస్ఎస్‌పట్నం గ్రామంలో ముగ్గులు వేస్తున్న మహిళలు


పిఠాపురంలో ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ


కాజులూరు మండలం అయితపూడిలో పేదలకు దుస్తులు, మిఠాయిలు పంచుతున్న దృశ్యం

పిఠాపురం, జనవరి 16: జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో సంక్రాంతి పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గృహాలు, ఆలయాల్లో గోపూజ జరిగింది. ఎక్కడికక్కడ హరిదాసులకు బియ్యం, నూతన వస్త్రాలు, పండ్లు తదితరాలను అందించారు. ఇళ్లల్లో నైవేద్యాలు సమర్పించారు. ఆలయాల్లో నెలరోజులు పాటు సాగిన ధనుర్మాస ఉత్సవాలు ముగిశాయి. సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. పిఠాపురంలోని జగ్గయ్యచెరువు కాలనీ, స్టువర్టుపేట తదితర ప్రాంతాల్లో సంక్రాంతి సంబరాల్లో ఆయన పాల్గొని రంగవల్లుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ముగ్గులను పరిశీలించారు. నిర్వాహకులను అభినందించారు.

పెద్దాపురం: డీవైఎఫ్ఐ, సీఐటీయూ, ఐద్వా, పీఎన్ఎం, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ఆటల పోటీలు ఉత్సాహంగా సాగాయి. స్థానిక నువ్వులగుంట వీధి, వరహాలయ్యపేటలో ఆటల పోటీలు, ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. విజేతలకు బహుమతులను మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో కూనిరెడ్డి రవికుమార్, రొంగల అరుణ్, దారపురెడ్డి కృష్ణ, కూనిరెడ్డి అరుణ, కె.అప్పన్న, దారపురెడ్డి క్రాంతికుమార్ పాల్గొన్నారు. స్థానిక మరిడమ్మ దేవస్థానంలో అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు ఆధ్వర్యంలో గోపూజా నిర్వహించారు. మండలంలోని కట్టమూరులో హిందూ ధర్మరక్షా సమితి, గ్రామస్థుల ఆధ్వర్యంలో శివాలయం వద్ద హరిదాసుకు సత్కారం నిర్వహించారు. హరిదాసు కొనపాకుల వేణు మాట్లాడుతూ ధనుర్మాసంలో హరినామ సంకీర్తనలతో ప్రజలను భక్తిపారవశ్యంతో ఆధ్యాత్మిక చింతన వైపు పయనించేలా తనవంతు కృషి చేస్తున్నానన్నారు.

జగ్గంపేటరూరల్: ఇర్రిపాకలోని శివాలయం వద్ద సంక్రాంతి ముగ్గుల పోటీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జ్యోతుల నెహ్రూ హాజరై విజేతలకు గ్లాస్‌తో కూడిన గ్యాస్టవ్, మిక్సీ, రైస్ కుక్కర్లను అందజేశారు. జ్యోతుల మణి, లక్ష్మీదేవి, అనీష్ నెహ్రూ, లక్ష్మీసాయి, టీడీపీ, జనసేన నేతలు ఉన్నారు.

కాజులూరు: అయితపూడి గ్రామంలో కొల్లు వెంకన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని దుస్తుల పంపిణీ నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు కొల్లు వెంకటేశ్వరరావు, ఇతర కుటుంబ సభ్యుల చేతుల మీదుగా సుమారు 500 మంది నిరుపేదలు, వృద్ధులకు దుస్తులు, పండ్లు, మిఠాయిలు పంచారు. కొల్లు వరలక్ష్మి, రవితేజ, శ్రుతీ, చైతన్యకృష్ణ, మణికుమారి, వేద, పంపన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కిర్లంపూడి: జగపతినగరం కాపుల రామాలయం వద్ద సంతూర్ కంపెనీ మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించింది. ముఖ్య అతిథిగా కిర్లంపూడి సొసైటీ చైర్మన్ చదలవాడ బాబి దంపతులు హాజరయ్యారు. పోటీలను కె.వెంకటేశ్వరరావు, టీవీవీ సూర్యనారాయణ, డీలర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్.తేజ, ఆనందకుమార్, సంతోష్ ఉన్నారు.

రౌతులపూడి: ఎస్ఎస్.పట్నం గ్రామంలో మేము సైతం సంక్షేమ సంఘం అధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు, ముగ్గులు పోటీలు, వివే కనంద యూత్ అధ్వర్యంలో వాలిబాల్ పోటీలు నిర్వహించారు. బలరామపురంలో దివంగ సర్పంచ్ దాసరి తాతాజీ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు.

తాళ్లరేవు: పి.మల్లవరం సెంటరులో సంక్రాంతి సందర్భంగా ఏర్పాటుచేసిన ముగ్గుల పోటీల విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందించారు. కార్యక్రమంలో ధూళిపూడి వెంకటరమణ, ముత్యాల జయలక్ష్మి, విళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

కొత్తపల్లి: శొంఠివారిపాకల్లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు కొత్తపల్లి మాజీ జడ్పీటీసీ వెంగళి సుబ్బారావు బహుమతులను అందజేశారు. యువతకు నిర్వహించిన కబడ్డీ, టగ్‌ఆఫ్ వార్ తదితర పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. పలువురు గ్రామపెద్దలు పాల్గొన్నారు. కొమరగిరి గ్రామంలో సంక్రాంతి ముగ్గుల పోటీల్లో విజేతలకు రైతు నాయకుడు మేడే కృష్ణారెడ్డి బహుమతులను అందజేశారు.

శంఖవరం: కత్తిపూడిలో సంతూర్ ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు నిర్వహించారు. కే.దేవి, పి.నవ్య, కే.జ్యోతి, తదితరులు విజేతలుగా నిలిచారు. విజేతలకు గాబు గంగాధర్, అడపా సోమేష్, పోసిన పెద్దకాపు, రామిశెట్టి వీరబాబు బహుమతులు అందజేశారు.

సామర్లకోట: కనుమ పండుగ సందర్భంగా రైతులు, పాడిపెంపకందారులు తమ ఇళ్ల ముంగిట పశువులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భీమేశ్వరా అన్నదాన ట్రస్ట్ ప్రతినిధి బిక్కిన పరమేశ్వర సాయి సత్యనారాయణ,రాజశేఖర్‌లు కుటుంబసమేతంగా ఆవులు, ఆవు దూడలు, గిత్తలు, ఆబోతులకు నుదుట, కాలి గిట్టలకు పసుపు కుంకుమలు అద్ది మెడలో పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ప్రత్యేక దాణాగా తవుడు, తెలగపిండి, బెల్లం, అరటిపళ్ళు ఆహారాన్ని అందించారు.

ప్రత్తిపాడు: మండలంలో సంక్రాంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. గజ్జెనపూడి, రాచపల్లి తదితర గ్రామాల్లో తాడిపెద్దును తప్పిడిగుళ్ళు, మేళతాళాలు, భజనలతో ఊరేగించారు. రాచపల్లి అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో కనుమ పండుగ సందర్భంగా బసవేశ్వరుడిని పలు పిండి వంటలతో అలంకరించారు.

గండేపల్లి: మండల గ్రామాల్లో సంక్రాంతి, కనుమ సంబరాలు ఘనంగా జరిగాయి. బంధువులు, కొత్త అలుళ్ళ రాకతో ప్రజలు సంతోషంగా ఇళ్లలో గడిపారు.త

తుని రూరల్: ప్రముఖ వ్యాపారవేత్త, సిటీ కేబుల్ ఎండీ చోడిశెట్టి త్రిమూర్తుల స్వామి తమ మాతృమూర్తి పేరుమీదుగా ఏర్పాటు చేసిన లోవ సూర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో 200 మంది వృద్ధులకు, పేదలకు ఆహార పొట్లాలతో పాటుగా దుస్తుల పంపిణీ నిర్వహించారు.


పెద్దాపురం: హరిదాసును సత్కరిస్తున్న గ్రామస్తులు


శంఖవరం: విజేతలకు బహుమతుల అందజేత


ప్రత్తిపాడు మండలం రాచపల్లి అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో మహానందీశ్వరుడికి పిండి వంటలతో అలంకరణ

జోరుగా కోడిపందాలు

భారీగా గుండాట, జూదాలు
పట్టించుకోని పోలీసులు
చేతులు మారిన లక్షలాది రూపాయిలు


సామర్లకోట మండలంలో కోడి పందెం దృశ్యం


పిఠాపురంలో జోరుగా ఆడుతున్న గుండాట

పిఠాపురం/గొల్లప్రోలు, జనవరి 16: పోలీసుల హెచ్చరికలు పనిచేయలేదు. జోరుగా కోడిపందాలు, జూదాలు జరిగాయి. లక్షలాది రూపాయిలు చేతులు మారాయి. ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేసి మరీ పందాలు కొనసాగించారు. సంక్రాంతి సందర్భంగా సంప్రదాయం పేరుతో 3రోజులు పాటు కోడిపందాల నిర్వహణకు అనధికారికంగా అనుమతులు లభించడంతో ఈ ఏడాది భారీస్థాయిలో కోడిపందాలు జరిగాయి. కోడి పందాల వద్దే గుండాట, ఇతర జూదాలను నిర్వహించారు. పేకాటలు కొనసాగాయి. పిఠాపురం పట్టణ శివారుల్లోని లేఅవుట్ ప్రాంతాలతో పాటు మండలంలోని విరవ, కందరాడ, బి.కొత్తూరు, రాపర్తి, పి.దొంతమూరు, పి.రాయవరం, చిత్రాడ గోకివాడ, వెల్దుర్తి, నరసింగపురం, ఎఫ్‌కేపాలెం తదితర ప్రాంతాల్లో, గొల్లప్రోలు మండలంలోని చేబ్రోలు, దుర్గాడ, కొడవలి, చెందుర్తి, చినజగ్గంపేట, తాటిపర్తి తదితర చోట్ల కోడి పందాలు నిర్వహించారు. ఇక్కడ బెట్టింగ్‌లు జోరుగా సాగాయి. లక్షలాది రూపాయిలు పందాలు రూపంలో చేతులు మారాయి. కోడి పందాలు, జూదాలు, పేకాటలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని, అరెస్టు చేస్తామని ప్రకటనలు, సమావేశాలు ద్వారా హెచ్చరికలు చేసిన పోలీసు అధికారులు సంక్రాంతి మూడురోజులు ఇటువైపు తొంగిచూడలేదు. అక్కడక్కడ పోలీసులు గుండాట శిబిరాలపై దాడులు చేసి నెంబరు గుండు బోర్డులను ధ్వంసం చేసినట్లు ప్రకటించినా, వారు వెళ్లిన కొంత సమయానికే మళ్లీ యథేచ్ఛగా గుండాట సాగడం గమనార్హం. కోడిపందాల వద్ద మద్యం విక్రయాలకు అదుపులేకుండా పోయింది. పందెం కోడి మాంసానికి గిరాకీ పెరిగింది. కోస మాంసం కోసం మాంసంప్రియులు ఎంత రేటైనా వెచ్చించేందుకు సన్నద్ధం కావడంతో అధిక ధరలకు విక్రయించారు. కోడిపందాలు కంటే ఈ సారి బెట్టింగ్‌లు అధికంగా జరిగాయి.

ఎఫ్‌కేపాలెంలో వివాదం

ఎఫ్‌కేపాలెం కోడిపందాల శిబిరం వద్ద వివాదం జరిగింది. 2 వర్గాల మధ్య పందెం డబ్బులు విషయంలో వివాదం ఘర్షణకు దారి తీసింది. ఇరువర్గాల తోసుకున్నాయి. పోలీసులు అక్కడకు వెళ్లి కోడిపందాలు, గుండాట శిబిరాలను, టెంట్లు తొలగించారు.

కిర్లంపూడి: మండలంలోని పలు గ్రామాల్లో కోడి పందాలు జోరుగా సాగాయి. కోడిపందాలు, గుండాట వల్ల భారీ ఎత్తున సొమ్ములు చేతులు మారాయి.

తుని రూరల్: అధికార పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మండలంలో కోడిపందాలు, గుండాట నిర్వహించారు. ఈ ఏడాది భారీగా బరులు పెరిగాయి. అధికార పార్టీ నాయకులు వేలంపాటలు నిర్వహించి అధికంగా పాట పాడిన వారికి బరులు అప్పగించారు. వీఐపీ గ్యాలరీలు, ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేశారు.

పెద్దాపురం: గ్రామాల్లో కోడి పందాలు యథేచ్ఛగా సాగాయి. మూడు రోజుల్లో రూ.లక్షల్లో చేతులు మారాయి. పైగా కాళ్లకు కత్తులు కట్టకూడదన్న నిషేధం ఉన్నా అవి ఎక్కడా అమలు జరగలేదు. రాజకీయ నాయకులు, పోలీసులు అండదండలు పుష్కలంగా ఉండడంతో పందెం రాయుళ్లు బరితెగించారు. పందాల ప్రాంతంలో యథేచ్ఛగా గుండాటలు, మూడు ముక్కలాట జరిగిపోయాయి. కొన్నిచోట్ల పోలీసులు హడావుడిగా గుండాట శిబిరాలను తొలగించి తమ తప్పేంలేదన్నట్టు చేతులు దులిపేసుకున్నారు.

కొత్తపల్లి: మండలంలోని కొత్తపల్లి, వాకతిప్ప, పాత ఇసుకపల్లి, నాగులాపల్లి, రమణక్కపేట, రావివారిపోడు గ్రామాల్లో నిర్వహించిన కోడి పందేలు, గుండాటల్లో లక్షలాది రూపాయలు చేతులు మారాయి. 3రోజుల పాటు పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారు. పందెం కొట్టినకోళలను కొనుగోలు చేసేందుకు ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు పోటాపోటీగా వేల రూపాయలకు కొనుగోలు చేయడం గమనార్హం.

సామర్లకోట: మండలంలోని పలు గ్రామాల్లో పండుగ 3రోజులపాటు కోడిపందాలు, గుండాటలు, మద్యం విక్రయాలు యథేచ్ఛగా నిర్వహించారు. వీకే రాయపురంలో పందాల నిర్వాహకులు ప్రైవేట్ బౌన్సర్లను 12మందిని నియమించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కోడిపందాల శిబిరాల వద్ద గుం డాటలు, పేకాటలు, కోత ఆటలు, ఎత్తుళ్ల ఆటలు నిర్విరామంగా జరిగాయి. మద్యంతోపాటు బిరియా నీలు, బజ్జీలు, ఫాస్ట్ ఫుడ్స్ వంటి ఆహారాల విక్రయాలతో మండలంలో రూ.5నుంచి రూ.8 కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు పందెంనిర్వాహకుల ద్వారా తెలిసింది.

కోడి పందాలపై దాడులు

కాకినాడ రూరల్, జనవరి 16: సంక్రాంతి పురస్కరించుకుని నిర్వహించిన కోడి పందాలు, గుండాటలపై దాడులు చేసి 3 కేసుల్లో ఆరుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు ఇంద్రపాలెం ఎస్ఐ మణికుమార్ తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో గల చీడిగ, తూరంగిలో చట్టానికి వ్యతిరేకంగా నిర్వహిస్తున్న కోడి పందాల శిబిరం నుంచి 6 కోడికత్తులు, రూ.3700 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. గుండాట బోర్డుల నుంచి రూ.1040 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

పెదపూడి: భోగి, సంక్రాంతి, కనుమ రోజులలో పెదపూడి మండల పరిధిలోని గ్రామాలలో నిర్వహించిన కోడి పందాలు, గుండాట, పేకాట శిబిరాలపై దాడి చేసి 41 మందిని అరెస్టు చేసినట్టు పెదపూడి ఎస్ఐ పీ.శోభన్‌కుమార్ తెలిపారు. వారి నుంచి 16 కోళ్లు, 16 కోడి కత్తులు, రూ.15,760 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

తాళ్లరేవు: మండలంలోని సుంకరపాలెంలో కోడిపందాలపై కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడిచేసి మంగళవారం నిలుపుదల చేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు కోడిపందేలను నిలిపివేశారు.

కొడవలిలో కోడిపందాల్లో వివాదం

గొల్లప్రోలు రూరల్, జనవరి 16: గొల్లప్రోలు మండలం కొడవలిలో కోడిపందాల నిర్వహణ విషయంలో 2వర్గాల మధ్య వివాదం ఏర్పడింది. పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకోవడంతో పాటు ఘర్షణకు దిగే ప్రయత్నం చేశారు. దీంతో కాకినాడ క్రైమ్ డీఎస్పీ రాంబాబు ఆధ్వర్యంలో పోలీసులు అక్కడకు చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. అక్కడ కోడిపందాలు, గుండాల శిబిరాలు, టెంట్లు తొలగించారు.

26 మద్యం బాటిల్స్‌తో ఇద్దరి అరెస్ట్

ప్రత్తిపాడు, జనవరి 16: మండలంలోని కిత్తమూరుపేట, ఏలూరులో మంగళవారం సీఐ పి.అశోక్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేసి మద్యం బాటిల్స్‌తో ఇద్దరిని అరెస్ట్ చేశారు. కొత్తమూరుపేటలో 13 మద్యం బాటిళ్లతో ఉక్కిన నాగమణి, ఏలూరులో మరో 13 మద్యం బాటిళ్లతో కోట అప్పారావును అరెస్ట్ చేశారు. దాడుల్లో ఎస్ఐ పి.శ్రీనివాసరావు, వెంకన్నదొర, కృష్ణార్జున, దొరబాబు, రాంబాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

టిఫిన్ స్టాల్‌ని ఢీకొన్న వాహనం

కాజులూరు, జనవరి 16: కాజులూరు మండలం గొల్లపాలెం గ్రామంలో టిఫిన్ స్టాల్(చక్రాల బడ్డీ)ని సోమవారం అర్థరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టినట్టు యజమాని దున్నల సత్యనారాయణ పేర్కొన్నాడు. రాత్రి సుమారు 12:30 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని కారు వేగంగా వచ్చి బడ్డీని ఢీకొని వెళ్లిపోయిందన్నాడు. ఆ సమయంలో అక్కడ జ నం ఉండుంటే ప్రాణనష్టం జరిగేదని వాపోయాడు. గొల్లపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపాడు.

ఒకే ఆకులో భోజనం

పిఠాపురం రూరల్, జనవరి 16: పిఠాపురం మండలం కందరాడలో బండి సాయికుమార్ ఇంటి వద్ద కుటుంబసభ్యులంతా ప్రతిఏటా మాదిరిగానే సంక్రాంతికి కలుసుకోవడమే గాక అందరూ కలిసి అరటి ఆకులో భోజనం చేశారు.


కందరాడలో ఒకే ఆకులో భోజనం చేస్తున్న బండి కుటుంబ సభ్యులు

కొనసాగిన అంగన్‌వాడీల ఆందోళన


ఏలేశ్వరంలో ఆందోళన నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ప్రత్తిపాడు, జనవరి 16: ఏలేశ్వరం, ప్రత్తిపాడు తహశీల్దార్ కార్యాలయాల వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన ఆందోళన మంగళవారం 36వ రోజుకు చేరుకుంది. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుందని అంగన్‌వాడీలు మండిపడ్డారు. జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఏలేశ్వరంలో కాకరపల్లి సునీత, ఎన్.అమరావతి, జె.రాణి, పి.గంగాభవాని, బి.సూర్యకుమారి.. ప్రత్తిపాడులో అల్లాడి లక్ష్మిహేమలత, పద్మ, వెంకటలక్ష్మి, తులసి, నాగసత్యవతి, అంగన్‌వాడీవర్కర్స్,హెల్పర్స్ పాల్గొన్నారు.

తునిలో...

తుని రూరల్: ప్రభుత్వ బెదిరింపులకు భయపడేది లేదని తునిలో 36వ రోజు చేపట్టిన సమ్మెలో అంగన్‌వాడీ కార్యకర్తలు స్పష్టం చేశారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా వెనుకడుగు వేయబోమని తమ న్యాయపరమైన హక్కులు ప్రభుత్వం నెరవేర్చేవరకు తమ పోరాటం ఆగదన్నారు. తుని అర్బన్, రూరల్ అంగన్‌వాడీలు, హెల్పర్లు, సీఐటీయూ నాయకులున్నారు.

రూ. లక్ష విరాళం



పిఠాపురం, జనవరి 16: పిఠాపురం పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామి సన్నిధిలో జరిగే నిత్యాన్నదాన పథకానికి కుమారపురం గ్రామానికి చెందిన న్యాయవాది నాళం నారాయణరావు(బేబీరావు) కుమార్తె డాక్టర్ శైలజ, డాక్టర్ సంజిత్ దంపతులు రూ.లక్ష మొత్తాన్ని పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు సమక్షంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఆగంటి ప్రభాకరావు, కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావులకు అందజేశారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

సినీ నిర్మాత పూజలు

గొల్లప్రోలు రూరల్, జనవరి 16: దుర్గాడలో కార్యసిద్ధి హనుమాన్‌ను ప్రముఖ సినీ నిర్మాత వివేక్ కూచిబొట్ల దర్శించుకున్నారు. బాల సుబ్రహ్మణ్యేశ్వరస్వాములను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ద్విభాష్యం సుబ్రహ్మణ్యం శాస్త్రి, కవికిరణ్ శర్మ వారిని సత్కరించారు.


నిర్మాత వివేక్ కూచిబొట్ల తదితరులు

వ్యక్తి అనుమానాస్పద మృతి


ఎరుపల్లి సత్తిరాజు మృతదేహం

సర్పవరం జంక్షన్, జనవరి 16: కాకినాడ రూరల్ సూర్యారావుపేటకు చెందిన ఎరిపల్లి సత్తిరాజు (34) అనే మత్స్యకారుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. అతడు స్థానిక పంచాయతీలో తాత్కాలికంగా పనిచేస్తున్నాడు. ఈ నెల 14న వరిపిల్లి శ్రీను మోటార్ బైక్‌పై బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో శ్రీనుని సత్తిరాజు సోదరుడు ప్రశ్నించగా ఏడీబీ రోడ్డులో గల కాళేశ్వరి నార్త్‌గేట్ వద్ద గల కల్వర్టు వద్ద కూర్చుని మద్యం తాగినట్లు చెప్పాడని సోదరుడు రాజు తెలిపాడు. మంగళవారం గాలించగా కాళేశ్వరి కల్వర్ట వద్ద ఉ న్న కాలువలో ఎరుపల్లి సత్తిరాజు మృతదేహం లభించినట్లు తెలిపాడు. సోదరుడు మృతిపై అనుమానాలు ఉన్నాయని, దర్యాప్తు చేసి కుటుంబానికి న్యాయం చేయాలని తిమ్మాపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు సోదరుడు ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తిమ్మాపురం ఎస్ఐ షరీఫ్ తెలిపారు.

జీ.మామిడాడలో అపూర్వ కలయిక

పెదపూడి, జనవరి 16: ఒకే కుటుంబానికి చెందిన 370 మంది అపూర్వ కలయికకు పెదపూడి మండలం గొల్లల మామిడాడ శ్రీదేవి ఫంక్షన్ హాల్ వేదిక అయ్యింది. జీ.మామిడాడకు చెందిన మేడపాటి సూరయ్య, మాణిక్యం దంపతులకు చెందిన వారసుల కలయిక ఆదర్శప్రాయంగా నిలిచింది. ఆ కుటుంబానికి చెందిన మేడపాటి వెంకట రామారెడ్డి,పప్పు చిన్నారెడ్డి, చిర్ల ధనకోటి వెంకటరెడ్డి, ద్వారంపూడి గంగిరెడ్డి, తేతలి భువనేశ్వరి ఈ కుటుంబ కలయికకు శ్రీకారం చుట్టారు.

